క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

లింగాపూర్: మండల కేంద్రంలో వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన జాదవ్ శంకర్ కుటుంబానికి అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ జాటోత్ దవీత్ కుమార్ ఆధ్వర్యంలో దశదినకర్మ కార్యక్రమానికి బుధవారం రూ.10వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు యువరాజ్, సుశీల్, విశ్వకాంత్, ధర్మేందర్, అశోక్, జైల్‌సింగ్ రంజిత్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న భరత్

కెరమెరి: జిల్లాలోని వివిధ కేజీబీవీల్లో ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ భూషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొన్నిచోట్ల అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందని, విద్యార్హత, మెరిట్, స్థానికత ఆధారంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సెడ్మకి తుకారాం, పూసం భీంరావు, తొడొసం జగన్నాథ్, ఆడా ఆనంద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి విద్యా మందిర్‌లో 2013–14 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తోటి స్నేహితుడు మాల్కడి తిలక్‌కు ఉన్నత చదువుల కోసం రూ. 82వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ తిలక్ పేదరికాన్ని దాటుకుని ఎంబీబీఎస్ పూర్తి చేసి ఎండీ జనరల్ మెడిసిన్‌లో సీటు సంపాదించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, స్నేహితులు సాయికృష్ణ, ఆకాష్, హరికృష్ణ, సమ్మన్న, సాయి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

తిర్యాణి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. మండలంలోని మాణిక్యపూర్ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం గుడుంబా తయారీ కోసం రెండు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లం పానకం గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. గంభీరావుపేట గ్రామానికి చెందిన దర్వాజల చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జంగంవాడ, సాయినివాడలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పాతలైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని శివాపూర్, నజ్రూల్‌నగర్, బసంతినగర్, కొత్తసారసాల, కోసిని గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు బుధవారం శంకుస్థాపన చేశారు.

మట్కా ఆడుతున్న ఒకరి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో మట్కా ఆడుతున్నారనే పక్కా సమాచారంతో బుధవారం దాడులు చేయగా పోతుల సాయికిరణ్ పట్టుబడినట్లు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సాయికిరణ్ తన ఇంటి వద్ద ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతూ పట్టుబడ్డాడని, అతని వద్ద మట్కా చిట్టీలు, మొబైల్ ఫోన్, కెమెరాస్టాండ్, ప్రింటర్ తోపాటు రూ.5వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సర్వే పూర్తి..!



దహెగాంలో సాగు భూమి (ఫైల్)

- మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 34,661 ఎకరాలు
- సాగుకు యోగ్యం కాని భూమి 74 ఎకరాలు
- ఈనెల 26 నుంచి రైతు భరోసా
- కొనసాగుతున్న గ్రామసభలు

దహెగాం: పంటల పెట్టుబడికి రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రైతుభరోసా సాయం కోసం మండలంలో చేపట్టిన సర్వే సోమవారం ముగిసింది. రైతు భరోసా పెట్టుబడి సహాయం సాగుకు యోగ్యంగా లేని భూములకు ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ఈనెల 15 నుంచి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సర్వే పూర్తి చేశారు. అందులో సాగుకు యోగ్యం కాని 74 ఎకరాల భూమిని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వానికి ఏడాదికి రూ. 8.88 లక్షలు ఆదా కానున్నాయి.

ఎకరానికి రూ.12 వేలు సాయం..

రైతు భరోసా పథకం కింద ఎకరానికి 6 వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఖరీఫ్, రబీ కలిపి సంవత్సరానికి ఎకరానికి రూ. 12వేలు సహాయం అందించనుంది. ఈనెల 26 నుంచి ఈ పెట్టుబడి సాయం అందించనున్నారు. మండలంలో 74 ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా లేదని సర్వేలో అధికారులు గుర్తించారు. లేఅవుట్లు, రైస్ మిల్లులు, ఇసుక రీచ్‌లు, ఇటుక బట్టీలు, తదితర సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించి రైతు భరోసా నుంచి ఆ భూములను తొలగించారు. సాగుకు యోగ్యంగా లేని భూములను తీసివేయడం ద్వారా ప్రభుత్వానికి సంవత్సరంలో రూ.8.88 లక్షలు మిగిలే అవకాశం ఉంది. యోగ్యం కాని భూములను తొలగించగా మండలంలో ప్రస్తుతం గ్రామసభలు కొనసాగుతున్నాయి. ఎవరైనా రైతులు అభ్యంతరాలు ఉన్నట్లయితే గ్రామ సభలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా పెట్టుబడి సహాయం అందనుంది.

34,661 ఎకరాలు..

మండలంలో అధికారిక లెక్కల ప్రకారం 34,661 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. అందులో ప్రధానంగా పత్తి, వరిని అధికంగా సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం భూమి పట్టా ఉన్న ప్రతీ రైతుకు రైతుబంధు పెట్టుబడి సహాయం అందించింది. సాగుకు యోగ్యంగా లేకున్నా పట్టా ఉంటే చాలు పెట్టుబడి సహాయం అందింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సారిగా రైతు భరోసా పెట్టుబడి పథకం అందించనుంది. దీంతో సాగుకు యోగ్యంగా లేని భూములకు పెట్టుబడి సహాయం అందించలేమని తేల్చి చెప్పింది.

74 ఎకరాలను గుర్తించాం

సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించాం. ఈనెల 15 నుంచి మండలంలోని 31 రెవెన్యూ గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాం. మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 34,661 ఎకరాలు ఉండగా అందులో 74 ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా లేదని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నూతనంగా పట్టా పొందిన రైతుల నుంచి రైతుభరోసాకు దరఖాస్తులు తీసుకుంటున్నాం. 1 -1 -2025వ తేదీలోపు పట్టా అయిన వారి నుంచి మాత్రమే దరఖాస్తులు తీసుకుంటున్నాం.

– రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి

ఇన్‌చార్జి అధికారులే దిక్కు!



ఎంపీడీవో కార్యాలయం

- రెగ్యులర్ అధికారులు లేక ఇక్కట్లు
- సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు

లింగాపూర్: లింగాపూర్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా కొత్త ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేదు. మండలానికి రెగ్యులర్ అధికారులు కూడా లేకపోవడంతో సమస్యల పరిష్కారానికి మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా, 30వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు.

గాడితప్పుతోన్న పాలన..

మండల స్థాయిలో ఇన్‌చార్జి అధికారులు ఉండడంతో పాలన గాడితప్పుతోంది. రెగ్యులర్ ఉన్నతాధికారులు లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడో వెళ్తున్నారో తెలియడం లేదని మండలవాసులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు, ఎంఈవోలు రెగ్యులర్ అధికారులు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కీలకమైన శాఖల అధికారులు ఇన్‌చార్జీలే కావడంతో వారు పూర్తిస్థాయిలో మండలంలో సేవలు అందించలేకపోతున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన రామేశ్వర్ అకస్మాత్తుగా అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో సిర్పూర్ (యూ) మండల ఎంపీడీవో కృష్ణారావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా తహసీల్దార్‌గా పని చేసిన బాబు రాజేంద్రప్రసాద్ పదవీ విరమణ పొందడంతో డిప్యూటీ తహసీల్దార్ రాజుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు సైతం రెగ్యులర్ గ్రామ కార్యదర్శులు లేరు. పిక్లాతండా, కంచన్‌పల్లి, పిట్టగూడ, మామిడిపల్లి గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు సైతం ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను మండలానికి కేటాయించాలని మండలవాసులు కోరుతున్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించాలి



రెగ్యులర్ అధికారులు లేక మండల ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇన్‌చార్జీల పాలన వల్ల అధికారులు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదు. వెంటనే మండలానికి రెగ్యులర్ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, వైద్యులను నియమించాలి.

– జాటోత్ దవీత్‌కుమార్, లింగాపూర్

'యువత చేతిలోనే దేశ భవిష్యత్తు'



బెజ్జూర్: మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్



పెంచికలపేట్‌లో..

బెజ్జూర్: దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని ఎస్సై ప్రవీణ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావ్ పర్యవేక్షణలో బుధవారం బెజ్జూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కళాబృందం ద్వారా రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ యువతతో పాటు ఇతరులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. ఈ సందర్భంగా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు, కళా బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపైన ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాహనాల ఆర్‌సీ, ఇన్సురెన్సు, డ్రైవింగ్ లైసెన్సులను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. తాగి వాహనాలను నడిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.

కొనసాగిన నిరాహారదీక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టిజన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, విద్యుత్ సంస్థలోని సర్వీస్ రూల్స్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన వారిని జీఓ నం.308 ప్రకారం ఆర్టిజన్‌లందరికి కన్వర్షన్ కల్పించాలని టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారం మూడోరోజుకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని ఎస్సీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలో పాల్గొన్న జేఏసీ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో అందరికి ఒకే రూల్స్ వర్తింపజేయాలని, విద్యార్హతలను బట్టి ఆర్టిజన్‌లందరికి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నసీరొద్దీన్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వమాన్, బుచ్చిబాబు, ఏకాంబరం, సత్తయ్య, ఆర్టిజన్‌లు పాల్గొన్నారు.



నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆర్టిజన్లు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

కౌటాల: బడీడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని సీఆర్పీ గంధం ప్రకాశ్ అన్నారు. బడి బయట పిల్లల సర్వేలో భాగంగా బుధవారం ముత్తంపేట గ్రామంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న ఇద్దరు పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. చదువుతోనే ఉజ్వల భవిష్యతు ఉంటుందన్నారు. చదువుకునే వయసులో పిల్లలను బడికి పంపాలని, పనికి పంపిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



సర్వే చేస్తున్న సీఆర్పీ ప్రకాశ్

'క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి'



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో జన్కాపూర్‌లో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో ఆసిఫాబాద్ యూత్ ఆధ్వర్యంలో గత 20 రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆసిఫాబాద్ క్రికెట్ కప్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేత ఉస్మానియా ఎలెవన్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండో బహుమతి రూ.15వేలను ఎడవల్లి జట్టుకు అందజేశారు.

బాలరాముని విగ్రహ ప్రతిష్ట గర్వకారణం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట భారతీయులకు గర్వకారణమని ఎమ్మెల్యే హరీశ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠించి ఏడాది గడిచిన సందర్భంగా బుధవారం పట్టణంలోని బాలాజీనగర్‌లో త్రినేత్ర శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు.

జాబితాలో పేర్లు రాకుంటే ఆందోళన వద్దు

- జెడ్పీ సీఈవో లక్ష్మినారాయణ



కెరమెరి: మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో లక్ష్మినారాయణ

కెరమెరి: జాబితాల్లో పేర్లు లేని వారు ఆందోళన చెందవద్దని జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మినారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మెట్టపిప్పిరి గ్రామసభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న నాలుగు పథకాలను అర్హులైన వారికి అందించేందుకు, వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రింగన్‌ఘాట్, సాకడ, పరంధోళి, ముకదంగూడ, కరంజివాడ, బోరిలాల్‌గూడ, ధనోరా, మెట్టపిప్రి, తుమ్మగూడ, ఆగర్‌వాడ, గోండ్‌గూడల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్, డీటీ సంతోష్‌కుమార్, పీజీహెచ్‌ఎం చంద్రశేఖర్, ఏఈఈ విశ్వేశ్వరావు తదితరులు ఉన్నారు.

లింగాపూర్: అర్హులందరికీ నాలుగు పథకాలు అందుతాయని ప్రత్యేకాధికారి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని సిర్పూర్(యూ), కోహినూర్(బి), పంగిడి గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. ఈనెల 24 వరకు గ్రామసభలు పూర్తి చేస్తామన్నారు. మోతిపటార్, కొత్తపల్లి, కిమానాయక్‌తండా, జాముల్‌ధరా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు ప్రశాంతంగా కొనసాగాయి. ఆయా గ్రామాల్లో తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో కృష్ణారావు, ఏవో సంజయ్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్‌రావు, ఏఈ అరవింద్, ఏపీవో చంద్రయ్య సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాల అమలులో భాగంగా నాలుగు పథకాలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న గ్రామసభలు రెండవ రోజు కొనసాగాయి. బుధవారం మండలంలోని ఇట్యాల, లగ్గాం, చౌక, చినరాస్పెల్లి, దిగిడ, బామానగర్, గెర్రె, గ్రామాల్లో ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించారు. లబ్ధిదారుల జాబితాను గ్రామస్తుల ఆధ్వర్యంలో చదివి వినిపించారు. జాబితాలో కొందరి పేర్లు లేవని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకాధికారులు కవిత, రాజేందర్, ఇనోస్, రమేశ్, ఆత్మారాం, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి, మురళీగూడ, కమ్మర్‌గాం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం ప్రత్యేక అధికారులు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు పథకాల కోసం అర్హుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో మనీషా, ఏఈ ఖదీర్, ఏఈవో శ్రీవిద్య, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, రాకేశ్, ఏపీవో సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీవో మౌనిక అన్నారు. బుధవారం మండలంలోని మోతుగూడ గ్రామంలోని గ్రామసభలో పాల్గొని అర్హులైన జాబితాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన అందరికి రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ బంధు, కొత్త రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, ఏఈవో ఖలీం, కార్యదర్శి రాందాస్, పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాల్లో లబ్ధి చేకూరేలా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని డీపీవో బిక్షపతి గౌడ్, రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్ రావులు అన్నారు. బుధవారం మండలంలోని వంకులం, జక్కులపెల్లి, ఇందిరానగర్, మాద్వాయిగూడ, రోళ్లపాడు, నంబాల గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో వాసుదేవ్, పంచాయతీ సెక్రటరీలు ప్రియాంక, కరుణశ్రీ, స్రవంతి, నరేశ్, ప్రేమలత, పుష్పలత వ్యవసాయశాఖ అధికారులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు



ఆసిఫాబాద్‌రూరల్: గ్రామసభలో..



రెబ్బెన: మాట్లాడుతున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు



లింగాపూర్: కొహినూర్(బి) గ్రామసభలో..



లింగాపూర్: మోతిపటార్‌లో..



దహెగాం: ఇట్యాలలో నిర్వహిస్తున్న గ్రామసభ

ఏఐసీసీ కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్సీ

బెజ్జూర్: ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విశ్వనాథన్ సూచించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.



సన్మానిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్